ప్రజాశక్తి
సోమవారం 12 డిసెంబర్ 2022
5
పార్వతీపురం మన్యం



బదిలీల నిబంధనలు సవరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి కలెక్టరేట్

ఉపాధ్యాయుల బదిలీల నిబంధనలు కొన్ని అసంబద్ధంగా ఉన్నాయని, వెంటనే వీటిని సవరించాలని, అలాగే బదిలీలు జరుపుతున్న నేపథ్యంలో పని సర్దుబాటును నిలిపివేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. పని చేసిన వారు ఎంత మంది ఉంటే అన్ని పోస్టులను మాత్రమే చూపాలని ఉన్నందు వల్ల దూర ప్రాంతాల్లోని ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. అన్ని పోస్టులను చూపెట్టాలని, అలాగే రేషనలైజేషన్ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులందరికీ పాయింట్లు కేటాయించాలని కోరారు. ప్రస్తుతం బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్, పని సర్దుబాటు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒక వేళ జరిపితే అదే మండలంలో సర్దుబాటు చేయాలని కోరారు.

పైసలిస్తే చాలు ఫైళ్లపై సంతకాలు?

- అక్రమార్కులకు అనుకూలంగా మారిపోతున్న రికార్డులు
- కీలక పాత్ర పోషిస్తున్న రెవెన్యూ అధికారులు

'వడ్డించేవాడు మనవాడైతే కడబంతిలో కూర్చొన్నా కొదవలేదు' అన్న చందంగా ఉంది మండలంలో రెవెన్యూ అధికారుల తీరు. వారి చేతుల్లో పైసలు పెడితే చాలు ఎటువంటి అక్రమ ఫైల్‌పైనైనా సంతకాలు పెట్టేస్తారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇటీవల వరుస జరిగిన రికార్డులు మార్పుల్లో కొన్ని విషయాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఏకంగా రికార్డులో ఉన్న వాటికి విరుద్ధంగా మార్చి అక్రమార్కులకు అనుకూలంగా అధికారులు వ్యవహరించిన తీరు మండలంలో ఇప్పుడు తీవ్ర చర్చ నీయాంశమైంది. రోజురోజుకు రెవెన్యూ అధికారులు చేస్తున్న ఆగడాలపై ఆఖరుకు అధికార పార్టీ నాయకులే స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా వారిపై ఎలాంటి చర్యల్లేకపోవడంతో వారి ఆగడాలకు అడ్డేలేకపోయిందని ఆ పార్టీ నాయకులే ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇందుకు మచ్చుకు కొన్ని...

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని గంగరేగువలస పంచాయతీ పరిధిలో గల జంఝావతి నది పక్కన రూ.3కోట్లు విలువైన సుమారు 2ఎకరాల ప్రభుత్వ భూమిని మండల రెవెన్యూ అధికారి పెద్దమొత్తంలో ముడుపులు తీసుకొని ఏకంగా కబ్జాదారుల చేతుల్లో పెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంగరేగువలసలోని సర్వే నెంబర్ 202/9లో ప్రభుత్వ రికార్డుల్లో 0.46 సెంట్లు మాత్రమే ఉండగా, పక్కనే ఉన్న నదీ పోరంబోకు భూమిని కలుపుకొనేందుకు అడంగల్ కరెక్షన్ పేరిట రికార్డుల్లేని అదనంగా మరో 2ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా మార్చారు. ఈ విషయం బయటకు పొక్కడంతో స్థానిక నాయకులు తహశీల్దార్‌ను ప్రశ్నించగా ఆ భూమిని అన్‌లైన్‌లో హోల్డ్‌లో పెట్టి తప్పించుకున్నారని నాయకులు ఆరోపించారు.

అలాగే దేవుకొన పంచాయతీలో గతంలో ప్రైవేటు స్థలం వివాదంలో ఉండగా వారి నుంచి రెవెన్యూ అధికారి భారీగా ముడుపులు తీసుకుని ఆ భూమిని ఒకరికి అనువుగా 144 సెక్షన్ అమలు చేయడంతో అప్పట్లో విమర్శలు వినిపించాయి. కొమరాడ మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిని ఇదేవిధంగా పలువురు పేరున మార్చారు. కోట్లు విలువైన భూమిని కొమరాడకు చెందిన కొందరు వ్యక్తుల పేరున ఆన్లైన్లో మార్చడం తీవ్ర గందరగోళ పరిస్థితికి దారితీసింది. విషయం తెలుసుకున్న కొమరాడ గ్రామ పెద్దలు, నాయకులు ఈ విషయంపై తహశీల్దార్‌ను ప్రశ్నించగా తనకు తెలియకుండా తప్పు జరిగిందని చెప్పి ఆన్లైన్లో మార్చిన భూమిని హోల్డ్‌లో పెట్టి అప్పట్లో తప్పించుకున్నారు. అనంతరం ఇటీవల కాలంలో ఆ భూమిని ఆన్లైన్లో క్రయ విక్రయాలకు అనువుగా మార్చిన విషయం తెలుసుకొన్న కొమరాడ నాయకులు, పెద్దలు హోల్డ్‌లో ఉన్న భూమిని వేరొకడికి ఆన్లైన్ చేయడంపై కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు తహశీల్దార్‌కు, జాయింట్ కలెక్టర్‌కు, కలెక్టర్‌కు నోటీసు పంపినట్టు గ్రామస్తులు తెలిపారు. ఇలా అనేక రికార్డులు మార్పుల్లో అవకతవకలు జరగడంతో ఆశాఖ అధికారుల మధ్య వాగ్వివాదాలు కూడా జరిగినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే రెవెన్యూ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన వ్యక్తిని జిల్లా కలెక్టరేట్‌కు డిప్యూటేషన్‌పై పంపేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత 15 రోజులుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ లేకుండా పనులు ఏ విధంగా జరుగుతున్నాయో పలువురికి అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో తహశీల్దార్ తనకు నచ్చినట్లు రికార్డులను మార్చేందుకు అవకాశం ఉందని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ విషయంపై స్థానిక తహశీల్దార్ రాధాకృష్ణను వివరణ కోసం సంప్రదించగా కార్యాలయంలో అందుబాటులో లేరు. అనంతరం ఫోన్లో సంప్రదించగా రికార్డులకు అనుకూలంగానే ఆన్లైన్లో పేర్లు మార్చామని, మండల సర్వేయర్ ఇచ్చిన రిపోర్టు మేరకే ఆన్లైన్లో పేర్లు మార్చామని తెలిపారు. అలాగే ఫైలు చూసి వివరాలు చెబుతామని చెప్పడం విశేషం.



గంగరేగువలసలో రియల్ వ్యాపారికి రెవెన్యూ అధికారులు కట్టబెట్టిన నదీ పరీవాహక భూమి

రైతుల్లో తుపాను గుబులు

- స్తంభించిన వరి కోతలు, నూర్పులు
- వరి పంటల సంరక్షణకు అన్నదాత పరుగులు

ప్రజాశక్తి-కురుపాం

బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుపాను ప్రభావంతో మన్యంలో గత రెండు రోజులుగా చినుకులు, ఈదురు గాలులతో వాతావరణం భిన్నంగా మారిపోయింది. తుపాను ప్రభావం నెలకొనడంతో వరి పంట సంరక్షణ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఏజెన్సీ అంతటా గత వారం నుంచి ముమ్మరంగా మొదలైన వరి కోతలు, నూర్పులు తదితర పనులు ఒక్కసారిగా స్తంభించాయి. ఇప్పటికే ఏజెన్సీలో 40 శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయి. కొందరు రైతులు ధాన్యం నూర్పులు కూడా చేపట్టారు. వర్షం ప్రభావం మన్యమంతటా నెలకొనడంతో రైతులు ఇప్పటికే సిద్ధమైన తమ వరి పంటను తుపాను ముప్పు నుండి సంరక్షించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వరి కోతలు పూర్తి చేసిన రైతులు తమ కళ్ళాల్లోనే వరి కుప్పలు వేసి వర్షం బారిన పడి పాడవకుండా పాలిథిన్ కవర్లతో కప్పి భద్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు. తుఫాన్ రాకడ గిరి రైతులకు వ్యయ ప్రయాసలు కలిగించింది. గ్రామాలకు దూరంగా ఉండే కల్లాల్లో వరి కుప్పలను సంరక్షించుకోవడానికి రైతులకు ప్రయాసగా మారింది. సిద్ధమైన పంట కూడా వర్షాలు, ముంపునకు గురికాకుండా రైతులు తమ పొలాల్లో వర్షపు నీరు చేరి పంట పాడవ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టి అప్రమత్తులయ్యారు. సరిగ్గా పంట చేతికి వచ్చే సమయానికి ఈ తుఫాన్ ప్రభావం రైతుల్లో కొంత గుబులు రేపుతోంది.



కోతకోసి పొలంలో ఉన్న వరి పంట

బహుళ ప్రయోజన ప్రాంగణం ప్రారంభం


ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని పులిపుట్టి సమీపంలో ఉన్న రామగిరి క్షేత్రం సమీపంలో గల భారతీయ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఉన్న సద్గురు శ్రీరామ యోగేంద్ర దివ్య సన్నిధిలో నిర్మించిన బహుళ ప్రయోజన ప్రాంగణాన్ని (కళ్యాణ మండపం) ఐటిడిఎ పిఒ బి.నవ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇలాంటివి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. ఈ బహుళ ప్రయోజన ప్రాంగణం కల్యాణాలతోపాటు సమావేశాలకు మంచి శుభ కార్యక్రమాలకు గిరిజనులకు ఉపయోగపడుతుందని దీనిని వినియోగించుకోవాలని కోరారు. పాఠశాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించు కోవచ్చు అని అన్నారు. కార్యక్రమంలో వాల్మీకి వనవాసి శ్రేయ సంస్థ అధ్యక్షులు ఎస్‌పి పెంటయ్య రామినాయుడు, ప్రిన్సిపాల్ నవీన్, మురళీమోహన్, అప్పలనాయుడు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా

- కిలో ఒక్క రూపాయికే పోర్టిఫైడ్ బియ్యం
- పెట్రోల్ కల్తీలపై తనిఖీలు
- ప్రజాశక్తితో జిల్లా పౌరసరఫరా అధికారి కెవిఎల్ఎన్ మూర్తితో ముఖాముఖి

రేషన్ సరుకులు ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలింపును అరికట్టేందుకు పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా పౌరసరఫరా అధికారి కెవిఎల్ఎన్ మూర్తి చెప్పారు. పోషక విలువలు కలిగిన పోర్టిఫైడ్ బియ్యాన్ని ఒక రూపాయికి సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో పెట్రోలు బంకుల్లో పెట్రోలు కల్తీలపై నిఘా పెట్టామని చెప్పారు. జిల్లాలో రేషన్ సరుకులు పంపిణీ, గ్యాస్ సరఫరా తదితర విషయాలను ప్రజాశక్తికి ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే... - ప్రజాశక్తి , కలెక్టరేట్





జిల్లాలో ఎన్ని తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి? ఏఏ సరుకులు అందజేస్తున్నారు?

పార్వతీపురం మన్యం జిల్లాలో 2,75,492 తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ 167మెట్రిక్ టన్నులు బియ్యం సరఫరా చేస్తున్నాం. బియ్యంతో పాటు రూ.67కు కేజీ కందిపప్పు, రూ.17కు అరకేజీ పంచదార పంపిణీ చేస్తున్నాం.

గిరి శిఖర గ్రామాలకు రేషన్ సరుకులు సరఫరా కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

గిరిశిఖర గ్రామాల సరుకులు సరఫరా కోసం ప్రభుత్వం తగిన ప్రత్యామ్నాయం కోసం ఆలోచిస్తున్నాం. గిరిశిఖర గ్రామాల సరుకులు సరఫరా కోసం అధిక వాహన సామర్థ్యం పెంచడం, ఆ గ్రామాల్లో సరుకులు సరఫరా చేసే వారికి అదనంగా ఇంధన అందజేయడం, ద్విచక్ర వాహనం ఉన్న గిరిజన నిరుద్యోగులను ఎంపిక చేసి వారి వాహనాలకు ఇంధనం అందజేసి, ఆననోరియం సౌకర్యం కల్పించి రేషన్ సరుకులు సరఫరా చేయాలనే ఆలోచనలో ఉన్నాం.

రేషన్ సరుకుల అక్రమ తరలింపుపై జిల్లాలో ఎన్ని కేసులు నమోదయ్యాయి?

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ తరలింపులో గరుగుబిల్లిలో 171 బస్తాలు, సాలూరులో 72 బస్తాలు బియ్యం అక్రమంగా తరలిస్తున్న వారిని పట్టుకొని కేసులు నమోదు చేశాం. రేషన్ బియ్యం ఎవరైనా అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

జిల్లాలో వంట గ్యాస్ సరఫరా ఏ విధంగా జరుగుతుంది?

జిల్లాలో వంట గ్యాస్ సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేవు. జిల్లాలో వినియోగానికి అవసరమైనంత గ్యాస్ సరఫరా జరుగుతుంది. ఎవరికైనా కొత్తగా గ్యాస్ కనెక్షన్ కావాలంటే ఎటువంటి ఇబ్బంది లేకుండా వెంటనే అందిస్తున్నాం. జిల్లాలో 8 హెచ్‌పిసిఎల్, 5ఐఒసిఎల్ , 2 బిపిసిఎల్ ఏజెన్సీల ద్వారా గ్యాస్ సరఫరా చేస్తున్నాం.

పెట్రోల్ బంకుల్లో జరిగే కల్తీపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో 42 పెట్రోల్ బంకులున్నాయి. ఇందులో హెచ్‌పిసిఎల్ 15, ఐఒసిఎల్ 15, బిపిసిఎల్ 5, ఇతర పెట్రోల్ ఏజెన్సీస్ 7 ఉన్నాయి. పెట్రోల్ బంకులను తరచుగా తనిఖీ చేస్తున్నాం. పెట్రోల్ బంక్‌లో కల్తీ జరిగినట్లుగా, నాణ్యతపై ఎవరికైనా సందేహం ఉంటే పెట్రోల్ బంకులు పేపర్ టెస్ట్ చేసుకోవచ్చు. ఎక్కడైనా కల్తీకి పాల్పడినట్లయితే వినియోగదారులు ఫిర్యాదు చేస్తే పెట్రోల్ ఏజెన్సీపై తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రాణాలను ఫణంగా పెట్టి..

- ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లదే కీలకపాత్ర
- ఇంట్లో ఇల్లాలిగా, సమాజంలో సేవకురాలిగా
- కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు
- పారితోషికం అంతంత మాత్రమే
- ప్రభుత్వ పథకాలకు బహుదూరం
- నేడు, రేపు విజయనగరంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

కరోనా పేరు చెబితేనే 'బాబోయ్..' అంటూ కోసెడు దూరం పరుగులు పెట్టే కుటుంబ సభ్యులు, రక్తసంబంధీకులను చూశాం... అటువంటి రోగుల ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టినవారిలో మొదటి స్థానంలో నిలిచారు ఆశా కార్యకర్తలు. ఆ మాటకొస్తే కేవలం కరోనా సమయంలో మాత్రమే కాదు.., గర్భిణులు, బాలింతలు, బాలబాలికల ఆరోగ్య బాధ్యతను సైతం తమ భుజాన వేసుకుంటున్నారు. వారిని చేరదీసి ఆరోగ్య సూత్రాలు చెప్పడమే కాదు సుమా..! అనారోగ్యంతో అల్లాడుతున్న వారిని ఒక తల్లిలా.. ఓ తోబుట్టువులా అక్కున చేర్చుకుంటూ... తన కొంగు చెంగుతో నెత్తుటి మరకలు తుడుస్తూ.. అవసరమైతే ఆస్పత్రులకు సైతం తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో తన ఆరోగ్యాన్ని ఫణం పెట్టి... పిల్లలు, కుటుంబ సభ్యుల అవసరాలను సైతం పక్కనబెట్టి సంఘంలో సేవకులుగా నిలుస్తారు. ఇంతటి కీలక సేవలందించే ఆశా వర్కర్ల వెతలు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వం చెల్లిస్తున్న పారితోషికంతో కుటుంబాన్ని నెట్టుకురాలేక, పనిభారం మోయలేక, రాజకీయ వేధింపులు తట్టుకోలేక నిత్యం సతమతమౌతున్నారు. వీటి పరిష్కారం కోసం ఏపి ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిత్యం పోరాడుతూనే ఉన్నారు. ఎన్నో విజయాలు సాధించుకున్నారు. మరికొన్నింటిపై పోరుబాట కొనసాగుతోంది. ఈనేపథ్యంలో విజయనగరం కేంద్రంగా సోమ, మంగళవారాల్లో యూనియన్ రాష్ట్ర మహాసభలు జరగనుండటంతో ఆశా కార్యకర్తల్లో పండగ వాతావరణం నెలకొంది. తమ కష్టనష్టాల్లో పాలుపంచుకుంటూ ముందుకు నడిపిస్తున్న సంఘం సభల్లో పాల్గొనేందుకు సన్నద్ధమయ్యారు.



కరోనా సమయంలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్న ఆశా కార్యకర్త (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సుమారు 16 ఏళ్ల క్రితం... 2006లో ఆశావర్కర్స్ వ్యవస్థకు అంకురార్పణ జరిగింది. క్షేత్ర స్థాయిలో మాతా శిశు సంరక్షణకు ప్రాథమిక ఆరోగ్య సూత్రాలు చెప్పడంతోపాటు రోగులకు - ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానంగా పనిచేయాలన్న లక్ష్యంతో నియమించిన ఆశా వర్కర్లు నేడు వైద్యారోగ్య రంగంలో అత్యంత కీలక భూమిక పోషిస్తున్నారు. కేవలం అప్పట్లో అప్పగించిన పనులకు మాత్రమే పరిమితం కాకుండా ఆ రంగంలో పోలియో చుక్కలు వేయడం మొదలుకుని, సుగర్, బిపి, క్షయ తదితర రోగులు, గర్భిణులు, క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేయడంలో వీరికి వేరొకరు సాటిలేరని చెప్పొచ్చు. కాల క్రమేణా.. ఇలా ఎన్నో బాధ్యతలు, పని భారం పెరిగినా అందుకు తగ్గట్టు వేతనాలు పెరగలేదు. గత ప్రభుత్వ హయాంలో రూ.3 వేల గౌరవ వేతనం, మరో రూ.3 వేల వరకు ఫిక్స్‌డ్ ఇన్సెంటివ్ అందేది. అనంతరం యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన పోరాటం వల్ల వైసిపి అధికారంలోకి వచ్చాక రూ.10వేల నిఖర ఆదాయం అందుకునే వరకు వచ్చారు. పెరిగిన ధరలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ పారితోషికం ఏ మూలకూ సరిపోని పరిస్థితి. మరోవైపు ఆశాల ఆదాయంలో కోత, వర్కర్ల సంఖ్య కుదింపునకు 2019లో ప్రభుత్వం తీసుకొచ్చిన చర్యలను యూనియన్ పోరాడి నిలువరించింది. ఇంతటి చాకిరీ చేస్తున్న ఆశా లకు వారాంతపు సెలవులు గానీ, మెటర్నిటీ లీవులు గానీ లేవు.

రంపచోడవరం ఐటిడిఎ పరిధిలో తొమ్మిది నెలల గర్భిణీగా ఉన్న కానూరు సోమాలమ్మ ఆశా కార్యకర్త విధినిర్వహణలో భాగంగా తన పరిధిలోని మరో గర్భిణిని ఆస్పత్రికి తరలించాక అక్కడే ఒక బిడ్డకు జన్మనిచ్చిన కొద్దిసేపట్లోనే తీవ్రమైన మానసిక ఒత్తిడి, శ్రమ తట్టుకోలేక చనిపోయింది. ఇప్పటికీ ఆ కుటుంబానికి ప్రభుత్వం తరపున సాయం అందలేదు. ఉద్యోగులుగా గుర్తించేందుకు మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వాలు ఫేషియల్ అటెండెన్స్‌కు సిద్ధపడటం గమనార్హం. ఎన్ఆర్‌హెచ్ఎం నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 1000 నుంచి 1200 జనాభాకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో 2000 నుంచి 2,500 జనాభాకు ఒకరు చొప్పున ఆశా కార్యకర్తలను నియమించాలి. గిరిజన గ్రామాల్లో వెయ్యిలోపు జనాభా ఉన్నా ఒక కార్యకర్తను నియమించాలి. ఈ నిబంధనలు పక్కన బెట్టడంతో పట్టణాల్లో ఒక కార్యకర్త 7 వేల మందికి, గ్రామీణ ప్రాంతాల్లో 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న 5 వేల మందికి సేవలందిస్తున్నారు. దీనికితోడు వైద్యారోగ్యశాఖ చేపడుతున్న ప్రతి సర్వేలను, ఆసుపత్రుల్లో క్లీనింగ్, ఎన్‌సిడి డిపి సర్వే వంటి అదనపు పనులను అప్పగిస్తుండడంతో ఆశాలకు తలకు మించిన భారంగా మారింది. సచివాలయ, పిహెచ్‌సి అధికారుల ఆధిపత్య పోరు మధ్య నలిగిపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచేయడం లేదు. ఫొటోలు అప్‌లోడ్ చేయడానికి 2జి సిమ్ సహకరించని పరిస్థితి.

ఈ నేపథ్యంలో ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించి, 20,600 చొప్పున కనీస వేతనం అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటీ వంటి సదుపాయాలు కల్పించాలని యూనియన్ డిమాండ్ చేస్తోంది. ఉద్యోగ విరమణ పొందినవారి కుటుంబ సభ్యుల్లో అర్హతను బట్టి తిరిగి ఆశా కార్యకర్తగా నియమించాలని, 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరుతున్నారు. ఇవేవీ పట్టించుకోని ప్రభుత్వం ఈ చిన్నపాటి గౌరవ వేతనం చెల్లిస్తున్నందుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పింఛన్లు, అమ్మఒడి, చేయూత, విద్యాదీవెన వంటి ప్రభుత్వ పథకాల నుంచి దూరం చేసింది. రిక్రూట్ మెంట్లలో స్థానిక సంస్థల జోక్యం కల్పించడంతో ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు పెరిగాయి.

కోవిడ్‌లో కీలకపాత్ర

కోవిడ్‌తో ఉన్న వ్యక్తి కనిపిస్తేనే పారిపోయే రోజుల్లో ఆశా కార్యకర్తలు రోగుల ఇళ్లకు వెళ్లి మందులు సరఫరా చేశారు. ప్రభుత్వం తరపున శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించినా, రిస్క్ అలవెన్స్ ఇవ్వకపోయినా విధి నిర్వహణకు ఎక్కడా వెనుకాడ లేదు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 35 మంది కరోనా బారిన పడి చనిపోయారు. కోవిడ్ భయంతో మరో 10 మంది మరణించారు. వీరిని ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. యూనియన్ పోరాటం వల్ల కరోనాతో చనిపోయిన వారిలో కేవలం ఆరుగురి కుటుంబ సభ్యులకు మాత్రమే రూ.50 లక్షల చొప్పున ఇన్సూరెన్స్ అందించింది.

రంగుమారిన ధాన్యం ప్రభుత్వమే కొనాలి : కళా

ప్రజాశక్తి-పాలకొండ

రంగు మారిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. ఆదివారం నక్కలపేటలోని కల్యాణ మండపంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు నేటికీ ప్రారంభించలేదని, రైతులకు ఈ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని విమర్శించారు. శివారు ప్రాంతాలకు సాగునీరందించడంలో విఫలమైందన్నారు. తోటపల్లి కాలువల పనులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. వ్యవసాయారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుందన్నారు. పాలకొండ ప్రాంతంలో సంక్రాంతి పండగలోపే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. రోడ్ల పరిస్థితి కూడా అధ్వాన్నంగా ఉందని, ముఖ్యంగా పాలకొండ-రాజాం రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉందని, ఈ ప్రాంతానికి చెందిన పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాలకొండ ఎస్‌టి నియోజకవర్గం కావడంతో చిన్నచూపు చూస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, అరకు పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు పల్లా కొండలరావు, మండలపార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్‌కుమార్, ఎఎంసి మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ వెన్నపు శ్రీనివాసరావు తదితరులున్నారు.

గత ఎన్నికల ఫలితాలే పునరావృతం

- వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట

సంక్షేమ పథకాలతో ప్రజలందరికీ చేరువయ్యామని, జిల్లాలో గత ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. నగరంలోని పూల్‌బాగ్‌లో ప్రయివేటు కళ్యాణ మండపంలో ఆదివారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు సంక్రాంతి తర్వాత శంకుస్థాపన చేయనున్నామని వెల్లడించారు. జలజీవన స్రవంతి పథకం కింద జిల్లాలో రూ.850 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకానికి తొందర్లోనే టెండర్లు పిలవనున్నట్టు తెలిపారు. జిల్లాలో లక్ష ఇళ్ల నిర్మాణం చేస్తున్నామన్నారు. పెండింగ్ బిల్లులు సంక్రాంతిలోపు క్లియర్ అయ్యేట్టు చూస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాలకు అందించాలనే తమ ప్రభుత్వ విధానమని సుబ్బారెడ్డి ఉద్ఘాటించారు. సొంత సామాజిక తరగతి కోసం చంద్రబాబునాయుడు అమరావతిలో రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని విమర్శించారు. పచ్చ మీడియా అభూత కల్పనలతో ముందుకు వెళ్తున్న చంద్రబాబు రాబోయే ఎన్నికల్లో అభాసుపాలవక తప్పదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో బూత్ కమిటీల మాదిరిగా గృహసారథులతో సమాంతర పార్టీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. దీనిపై నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో తొందర్లో ముఖ్యమంత్రి సమావేశం అవుతారని తెలిపారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో టిడిపి నేత అశోక్‌కు కేంద్రమంత్రి పదవి వచ్చిందని సంతోషించామని, కానీ విమానాశ్రయం, యూనివర్సిటీ కోసం ఏంచేశారని ప్రశ్నించారు. తాము ఉత్తుత్తి మాటలు చెప్పే బాపతులం కాదని, వాస్తవాలు మాట్లాడాలని అశోక్‌కు హితవుపలికారు. ఎమ్మెల్యేలు ఫోన్లు ఎత్తడం నేర్చుకోవాలని, రాజకీయాల్లో ఉండే వారికి కమ్యూనికేషన్ ముఖ్యమని చురకలంటించారు. జిల్లాలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులతో కలిసి ముందుకు సాగాలని సూచించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ కార్యకర్తల సమిష్టి కృషే పార్టీకి బలమన్నారు. రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు వైసిపికే మాత్రమే ఉందన్నారు.

సమావేశంలో డిప్యూటీసిఎం పి.రాజన్నదొర, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మేయర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి

నేటి నుంచి 18 వరకు
క్లాప్ కార్యక్రమాలు

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమాలు సోమవారం నుంచి ఈనెల 18 వరకు క్లీన్‌సిటీ కార్య క్రమాలు నిర్వహిం చనున్నట్టు నగర పంచా యతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు తెలి పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 12, 13 తేదీల్లో క్లస్టర్ల వారీగా సచివాలయ సెక్రటరీలు, వాలంటీర్లు, ఆశావర్కర్లు, మెప్మా సిబ్బంది, ఎడ్యుకేషన్ ఇన్సిట్యూట్, వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. క్లస్టర్ల వారీగా ప్రతి ఇంటికీ కరపత్రాలు పంపిణీ, డస్ట్‌బిన్లు నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం వార్డు పరిధిలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ, తడి, పొడి చెత్తను వేరు చేయడం, మూడు రకాల డస్టబిన్లను ఉపయోగించడం, హెూం కంపోస్టింగ్, యూజర్‌ఛార్జీలపై అవగాహన కార్యక్రమాలు, సచివాలయాల వద్ద ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ, క్లీన్ ఆంధ్రప్రదేశ్ ఫొటో ఎగ్జిబిషన్ వీడియో క్లిప్పింగ్‌లు ప్రదర్శన, 18న క్లీన్‌సిటీ, క్లీన్ ఆంధ్రప్రదేశ్ ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

12ఏళ్లుగా అద్దె భవనంలో ప్రభుత్వ ఐటిఐ

- నిధులున్నా వేధిస్తున్న భూమి కొరత
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ గత 12ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా భూమి కొరతతో ఇరుకు గదుల్లో సంస్థ నడుస్తోంది. సొంత భవనం నిర్మాణానికి స్థలం కావాలని ఐటిఐ అధికారులు గత 12ఏళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఫలితం కనిపించడం లేదు. ఐటిఐలో ఎనిమిది ట్రేడులు ఉన్నాయి. 300మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రాక్టికల్ శిక్షణ కోసం అవసరమైన ప్రయోగ శాలలకు, వాటి పరికరాల ఏర్పాటుకు సరిపడా వసతి సౌకర్యం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, రేడియో అండ్ ఎసి, డ్రాఫ్ట్ మెన్ సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, కంప్యూటర్ కోఫా కోర్సులు వున్నాయి. వెనుకబడిన గిరిజన నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఐటిఐకి ఏళ్ల తరబడి భూమి అప్పగించకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ప్రస్తుతం కార్యాలయ భవనం విఆర్ఎస్ శిథిల భవనంలో ఉంది. తరగతుల నిర్వహణ కెవిఆర్ ఎస్టేట్స్ ప్రాంగణంలో ఉన్న అద్దె భవనంలో జరుగుతోంది. ఈ భవన నిర్మాణానికి భూసేకరణ చేయాలని ఐటిఐ అధికారులు మండల తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుత డిప్యూటీ సిఎం రాజన్నదొరను అనేకసార్లు కలిసి సమస్యలు వివరిస్తున్నారు. ఆయన అధికారులకు భూసేకరణ చేయాలని ఆదేశిస్తున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వివాదాస్పదమవుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట, భద్రగిరి, సాలూరులో ప్రభుత్వ ఐటిఐలు ఉన్నాయి. సాలూరు తప్ప మిగిలిన రెండు ఐటిఐలకు సొంత భవనాలు ఉన్నాయి. భూసేకరణపై స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధి చూపకపోవడంతో ఐటిఐ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



శిథిలావస్థలో గల అద్దెభవనంలో ఉన్న ఐటిఐ

ఎకరా భూమి ఇచ్చేందుకు అనుమతి

ప్రభుత్వ ఐటిఐకి సొంత భవనం నిర్మాణానికి ఎట్టకేలకు అధికారులు ఎకరా భూమిని చూపించారు. దీన్ని చదును చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. సొంతభవనం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మక్కువ రహదారి లో 216-ఎలో ఎకరా భూమి ని రెవిన్యూ అధికారులు పరిశీలించారు. జెసి ఆనంద్ ఆదేశాల మేరకు మండలతహశీల్దార్ భూమి పరిశీలించారు.

రవికుమార్, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటిఐ, సాలూరు.

ఐటిఐ కోర్సులకు డిమాండ్

సాంకేతిక విద్యకు సంబంధించిన కింద స్థాయి కోర్సులకు క్రమేణా డిమాండ్ పెరుగుతోంది. ఐటిఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, రేడియో అండ్ ఎసి, డ్రాఫ్ట్ మెన్ సివిల్ వంటి రెండేళ్ల కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. సొంత భవనం ఉంటే ప్రాక్టికల్ శిక్షణకు సంబంధించిన అనేక పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసే అవకాశం ఉంది. సొంత భవనం లేకపోవడం, ఇరుకు గదుల్లో తరగతులు, ప్రాక్టికల్ శిక్షణ కొనసాగుతుండడంతో లేబొరేటరీ పరికరాల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించలేకపోతున్నారు. దీనివల్ల విద్యార్థులకు తగిన ప్రాక్టికల్ శిక్షణ అందించలేని పరిస్థితి కనిపిస్తోంది. కొన్ని ప్రాక్టికల్ శిక్షణ కోసం బొబ్బిలి ఐటిఐకి విద్యార్థులను పంపించాల్సి వస్తోంది. తాజా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భూమి అప్పగించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

జెసి ఆదేశాలతో కదలిక

పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో స్థానిక రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఐటిఐ నిర్మాణానికి భూసేకరణపై దృష్టి సారించారు. మక్కువ రహదారిలో ఎంపిడిఒ కార్యాలయానికి సమీపంలో సర్వే నెంబర్ 216-ఎలో 8.75ఎకరాల భూమి ఉంది. దీనిలో ఎకరా భూమిని ప్రభుత్వ ఐటిఐ నిర్మాణానికి అప్పగించాలని జెసి ఆనంద్ మండల తహశీల్దార్ రామస్వామిని ఆదేశించడంతో కింద స్థాయి అధికారుల్లో చలనం వచ్చింది. ఆ భూమిని అప్పగించడానికి కూడా రెవెన్యూ అధికారులు కొర్రీలు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమి అయినప్పటికీ సమీపంలో ఉన్న లెప్రసీ కాలనీ వాసులు ఆక్రమించడంతో వారిని ఖాళీ చేయించేందుకు అధికారులు తటపటాయిస్తున్నారు.


మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మన్యం జిల్లా రైస్ మిల్లర్స్ భవనం ప్రారంభం

పార్వతీపురంటౌన్ : పట్టణ శివారులో గల వెంకంపేట గోలీలు కూడలి, ప్రధాన రహదారి పక్కన పార్వతీపురం మన్యం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన భవనాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ కొత్తగా ఏర్పాటు చేసిన భవనంలో కార్యకలాపాలు చక్కగా నిర్వహించి అసోసియేషన్ మంచి అభివృద్ధిలోకి రావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో బ్యాంక్ గ్యారంటీ పత్రాలను ప్రభుత్వానికి అందజేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్తకోట రమేష్, ఉపాధ్యక్షులు జి.ఉదయభాను, టి.ప్రసాద్, సెక్రెటరీ టి వెంకటరమణ, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపటివలసలో గడపగడపకు..

సీతానగరం : మండలంలోని తామర కండి సచివాలయం పరిధిలోగల రేపటి వలసలు ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు సక్రంగా అందుతున్నాయా లేదా తెలుసుకుని న్యాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ఎం. బాబ్జి, ఎంపిపి బి. రమణమ్మ, శ్రీరాములు నాయుడు, బి. చిట్టిరాజు, ఎం. ధనుంజయ్, ఎం. రామకృష్ణ, శ్రీనివాసరావు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు డోలమడలో

పాలకొండ రూరల్ : మండలంలోని డోలమడ సచివాలయ పరిధిలో గల బర్న, వంతవాడ, వంతవాడ కాలనీ, డోలమడ వలన, డోలమడ ప్రాంతాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ విశ్వాసరాయి కళావతి వైసిపి శ్రేణులతో కలిసి పాల్గొంటారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఎంఎల్ఎ నేరుగా ప్రజలతో మాట్లాడి వారి నుంచి వినతులు స్వీకరిస్తారని ఎంపిడిఒ డొంక త్రినాధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.


ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ జెఎసి నాయకులు

గిరిజన సమస్యలపై 19న భారీ ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం : గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19న పార్వతీపురంలో అతిపెద్ద ర్యాలీ నిర్వహిస్తామని ఆదివాసీ నాయకులు ఆదివారం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ మేరకు మండలంలోని రేగిడిలో గోడ పత్రిక విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బెంతు ఒరియాలను ఆదివాసీలుగా మార్చొద్దని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలోనే ఏకలవ్య, కస్తూరాబా పాఠశాలల్లో ఉద్యోగులుగా గిరిజనులనే నియమించాలని పేర్కొన్నారు. జీవో 3ను కోర్టు కొట్టేసిన నేపథ్యంలో దాని స్థానంలో కొత్త జీవోను తీసుకురావాలన్నారు. తాము నిర్వహిస్తున్న ర్యాలీని జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా కార్యదర్శి పువ్వల సత్యనారాయణ, తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో స్నేహచైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు, నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవినాయుడు ఏర్పాటుచేసిన ఉచిత కంటి శిబిరంలో విజయనగరం వెంకట పుష్పగిరి హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు వి.కిరణ్ నేత్ర తనిఖీలు చేయగా, 15మందిని శస్త్రచికిత్సలకు పంపామని తెలిపారు. కార్యక్రమంలో కర్రి సతీష్, శ్రావణ్, భాస్కర్ రావు, దుర్గా ప్రసాద్, డాక్టర్ శ్రీను పాల్గొన్నారు.


గురువులతో కలిసిన పూర్వ విద్యార్థులు

గురువులకు ఘన సన్మానం

కురుపాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. టెన్త్ వరకూ కలిసి చదువుకున్న వారంతా వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వారంతా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని ఒకదగ్గర కలుసుకోవడంతోపాటు వారి గురువులను ఘనంగా సత్కరించారు. ఆత్మీయ పలకరింపులు, పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, నాటి గురువులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

సీతానగరం : స్థానిక హనుమాన్ జంక్షన్ కూడలిలో ఆదివారం ఎస్ఐ కె.నీలకంఠం ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మోటార్ బైక్‌కు సంబంధించి అన్ని రకాల కాగితాలు ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలను అందరూ పాటించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు,


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నీలకంఠం


పార్వతీపురం- ఒడిశా మధ్య జరుగుతున్న అంతర్రాష్ట్ర రహదారి పనులు

శరవేగంగా అంతర్రాష్ట్ర రహదారి పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం నుంచి ఒడిశాలోని కొరాపుట్ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.17 కోట్లతో ఒడిశా సరిహద్దు చీడివలస నుంచి పార్వతీపురం వరకు రహదారిని ఏడు మీటర్లుగా విస్తరిస్తున్నారు. లోవవలస సమీపంలో ఓ వైపు లోయ ఉండడంతో మరోవైపు కొండను తొలిచారు. రహదారి వెడల్పు పది మీటర్లు ఉంటుందని, ఏడు మీటర్లలో తారు వేస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతమున్న రహదారి చాలా ఏళ్ల క్రితం రెండున్నర మీటర్ల వెడల్పుతో వేశారు. ఇన్నాళ్లు ఎక్కడికక్కడ గుంతలతో పూర్తిగా ఇది కుచించుకుపోయింది. ఈ నేపథ్యంలో దీని అభివృద్ధికి నిధులు విడుదల కావడంతో ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఇప్పటివరకు రహదారి పొడవునా 16 ఖానాల నిర్మాణం పూర్తి చేసినట్లు డిఇఇ అప్పాజీ తెలిపారు. జనవరి నాటికి రోడ్డును అందుబాటులోకి తెస్తామన్నారు. వెంకంపేట, చినబొండపల్లి, ఎమ్మార్ నగరాల్లో విస్తరణకు మార్కింగ్ చేసి కాలువల నిర్మాణం చేపడుతున్నట్టు జెఇ ప్రమీల తెలి పారు. రోడ్డు అందుబాటులోకి వస్తే ఒడిశా వెళ్లేవారి కష్టాలు తీరనున్నాయని వాహన చోదకులు చెబుతున్నారు.

ఉపకరణాల పంపిణీకి ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

వికలాంగ విద్యార్థులకు కురుపాం భవిత కేంద్రం వద్ద ఈనెల 13న ఉచిత ఉపకరణాల పంపిణీ నిమిత్తం ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ ఎన్.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం, జియ్యంవలస, గుమ్మలక్ష్మీ పురం మండలాల్లోని వికలాంగ విద్యార్థులకు ఉపకరణాలు ఎంపిక, నిర్ధారణ శిబిరం పార్వతీపురం మన్యం జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ శిబిరానికి 5 నుంచి 18ఏళ్ల వయసు కలిగిన వికలాంగ విద్యార్థులు అర్హులని, ఈనెల 13న ఉదయం 10 గంటలకు స్థానిక భవితా కేంద్రానికి వారి ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డ్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకురావాలని సూచించారు. అవసరమైన పరికరాలు అందజేసేందుకు ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు .

వికలాంగులకు ఇళ్ల పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలోని వికలాంగులకు ఇళ్ల పట్టాలు, భూమి పట్టాలు మంజూరు చేయాలని మదర్ థెరిసా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జిల్లెల్ల సీతారాం కోరారు. ఆదివారం ఆయన అధ్యక్షతన సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు రైలు పాసులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. పింఛన్ మొత్తాన్ని రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచాలని కోరారు. భూమి, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి రవితేజ పాల్గొన్నారు.

నేడు ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

వికలాంగులకు అవసరమైన వివిధ ఉపకరణాల నిమిత్తం ఈనెల 12న సోమవారం నిర్ధారణ శిబిరం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించనున్నట్టు సంబంధిత ఉపాధ్యాయులు సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాలకు చెందిన 0 నుంచి 18 ఏళ్ల గల వికలాంగులు మాత్రమే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చిన వికలాంగులు సదరం, ఆధార్, తెలుపురంగు రేషన్‌కార్డుతో పాటు మూడు పాస్‌ఫోటోలు తీసుకురావాలన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి శిబిరం జరగనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9182867188 నెంబర్‌ను సంప్రదించాలన్నారు..


మృతి చెందిన దుర్గా ప్రసాద్

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మనస్థాపనతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని చినమేరంగిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దాసరి దుర్గాప్రసాద్ (29)కు ఏడు నెలల క్రితం వివాహమైంది. తన మేనకోడలను ప్రేమించిన దుర్గాప్రసాద్‌కు వేరే అమ్మాయితో వివాహమైంది. అనంతరం భార్యాభర్తల మధ్య వివాహ తరచూ గొడవలు జరిగి మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో దుర్గాప్రసాద్ తన ఇంటి సమీపానికి ఉన్న కళ్లంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాలపడ్డాడు. మృతుడి భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జి.కళాధర్ తెలిపారు.

మర్రిపాడులో 'ఇదేం కర్మ'



సీతానగరం : చినంకలాంలో ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని మర్రిపాడులో టిడిపి నాయకులు పడాల భూదేవి ఆధ్వర్యంలో ఆదివారం ఇదేమి కర్మ కార్యక్రమం నిర్వహించారు. పెదబగ్గ, కొత్తగూడ, మర్రిపాడు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రానికి రాజధాని లేదు ఇదేమి ఖర్మ రాష్ట్రానికి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భూదేవి మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజల జీవన స్థితి అస్తవ్యస్థంగా మారిందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి లేక అల్లాడిపోవడం మన ఖర్మ అన్నారు. ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన వైసిపి అన్ని వర్గాల ప్రజలకు నడ్డివిరిచే కార్యక్రమాలు చేపట్టటంతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి యస్ కుంపి, నాయకులు బిడ్డిక వెంకటరమణ, బిడ్డిక హేమలత, యస్ మాసయ్య, యస్ మంగయ్య, బిడ్డిక రామకృష్ణ, ఊయక భానుచందర్, సవర గణేష్, సవర మల్లేష్, ఊయక శంకర్రావు, బిడ్డిక సోమయ్య, పసుపురెడ్డి రెల్లి, కె కామేశ్వరరావు, జమ్మయ్య, ఒబియో, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని చినంకలాంలో ఇదేమి కర్మ ఈ రాష్ట్రానికి అనే కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యాన జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపసర్పంచి బెహర సురేష్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో ఇదేమి కర్మ కార్యక్రమం టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య ప్రారంభించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేస్తున్న అరాచకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత కుమార్, నాయకులు రమేష్ చంద్ర పండా, చిలకలపల్లి వెంకటరావు, ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభ విజయవంతానికి ప్రచారం



పాచిపెంటలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - పాచిపెంట

పార్వతీపురంలో ఈనెల 13,14 తేదీల్లో జరగనున్న సిఐటియు 10వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పాచిపెంట మండల కేంద్రంలో ఆదివారం సిఐటియు నాయకులు ప్రచారం చేశారు. ఈ మహాసభలకు కార్మికులు, ఉద్యోగులు, స్కీం వర్కర్లు, ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, శ్రామిక మహిళలంతా కదిలి వచ్చి జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు చింత పోలిరాజు, కోరాడ ఈశ్వరరావు అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన కార్మిక చట్టాలను తీసుకొచ్చి కార్మికులను వీధుల్లోకి నెట్టే ప్రమాదకరమైన పరిస్థితిని తీసుకొచ్చిందని, దీని వల్ల కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో కార్మిక సమస్యలపై చర్చలు జరుగుతాయని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. కావున ఈ మహాసభలు విజయవంతానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు దీసరి బుచ్చియ్య, రైతు సంఘం నాయకులు ఎల్.అప్పలనాయుడు పాల్గొన్నారు.


జలపాతం వద్ద కేరింతలు కొడుతున్న చిన్నారులు

పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్ పర్యాటకలతో పోటెత్తింది. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నిండు కూడా ఇతర రాష్ట్రాల నుండి కూడా తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జల విహార వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. ఆల్టన్ వెహికల్ పార్కు చుట్టుముట్టారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేసి కేరింతలు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

108లో ప్రసవం

గజపతినగరం : దత్తిరాజేరు మండలం దత్తి గ్రామానికి చెందిన గర్భిణీ పి.ఆదిలక్ష్మి ప్రసవం కోసం స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరారు. ఆదివారం అత్యవసర సేవలు అవసరం నిమిత్తం వైద్య సిబ్బంది విజయనగరం ఘోష ప్రసూతి ఆసుపత్రికి 108లో ఆమెను తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆమె ప్రసవించి ఆడపల్లికు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈ.ఎమ్.టి కె.కుమారి, పైలట్ బి.సత్యనారాయణ తెలిపారు. అనంతరం విజయనగరం గోషాసుపత్రిలో చేర్పించినట్లు చెప్పారు.


పొలంలోకి ఒరిగిపోయిన బస్సు

బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

బొబ్బిలి: ఆర్‌టిసి బస్సుకు తృటిలో ప్రమా దం తప్పింది. పార్వతీ పురం డిపోకు చెందిన పాసింజర్ బస్సు బొబ్బిలి నుంచి విజయ నగరం వెళ్తుండగా గొర్లె సీతారాంపురం వద్ద స్టీరింగ్ పట్టివేయడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతులోకి దూసుకుపోయింది. డ్రైవర్ కృష్ణ చాకచక్యంగా వ్యవహరించి బస్సును అదుపు చేయడంలో పెను ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రయాణికులు సహాయంతో బస్సును రోడ్డుపైకి నెట్టి విజయనగరం వెళ్లారు.

ముందుగా కౌన్సిలింగ్ నిర్వహించాలి

ప్రజాశక్తిబి పార్వతీపురం రూరల్

ఎయిడెడ్ పాఠశాలల నుంచి ప్రభుత్వంలోకి విలీనమైన ఉపాధ్యాయులకు ముందుగా కౌన్సిలింగ్ జరిపిన ఆ తర్వాత సాధారణ బదిలీలు జరిపి వారికి న్యాయం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. దీనికి సంబంధించి ప్రభుత్వానికి తమ సంఘం ద్వారా ప్రాతినిధ్యం చేయనున్నట్లు తెలిపారు. రేషనలైజేషన్ ద్వారా బదిలీకి గురవుతున్న ఉపాధ్యాయులకు ఎటువంటి షరతులూ లేకుండా రేషనలైజేషన్ పాయింట్లు కేటాయించాలని కోరారు.


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పిటిసి సభ్యులు భాస్కరరావు

30 మందికి చీరలు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీ పురం ప్రాంతంలో నివాసం ఉంటున్న 30మంది నిరుపేదలకు కాపు సంఘ సభ్యులు ఆదివారం చీరలు పంపిణి చేశారు. మాజీ జెడ్పిటిసి అలజంగి భాస్కరరావు 20 చీరలు అందించారు. మరో పది చీరలను కాపు సంఘం సభ్యులు సమకూర్చారు. నిరుపేదలకు చీరలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షులు కొన్నిస మన్మధరావు, ఉపాధ్యక్షులు సొంటేన రాజేష్, సభ్యులు ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం, ఎస్ఎన్‌సియుల్లో రోగులకు, బాలింతలకు కాపు సంఘ నాయకులు నెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీధర్, శివ, ఐసిటిసి కౌన్సిలర్ ఎ.మోహనరావు, వైద్య సిబ్బంది, కాపు యువత జి.ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రోగులకు, బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న కాపు సంఘం నాయకులు